క్లుప్తంగా

లయన్స్ క్లబ్ నూతన కమిటీ ఏర్పాటు



లయన్స్ క్లబ్ నూతన కమిటీ అధ్యక్షుడు, కార్యదర్శి, కోశాధికారి

ఆకివీడు: స్థానిక లయన్స్ క్లబ్ నూతన కమిటీ ఏర్పడింది. కమిటీ అధ్యక్షుడిగా కంభంపాటి లక్ష్మీనరసింహం, కార్యదర్శిగా గొట్టుముక్కల వెంకట సూర్య సత్యనారాయణరాజు (బాబు), కోశాధికారిగా ముదుండి వెంకట సుబ్బరాజులు ఎంపికయ్యారు. జాయింట్ సెక్రటరీ ఓలేటి వెంకట సుబ్రహ్మణ్యం, వైస్ ప్రెసిడెంట్లుగా నెల్లి సతీష్ కుమార్, బి.చింతారావు, లయన్స్ రీజినల్ చైర్మన్‌గా గొంట్లా కృష్ణమూర్తి నియమితులయ్యారు. ఈ నెల 7న ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ముఖ్యఅతిగా పీఎం జేఎఫ్ లయన్స్ సీహెచ్.కృష్ణంరాజు, ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని నిర్వహిస్తారు.

కొత్త న్యాయ చట్టాలను రద్దు చేయాలి



ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

ఆకివీడు: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త న్యాయ చట్టాలను రద్దు చేయాలని సీపీఎం డిమాండ్ చేసింది. ఈ మేరకు స్థానిక శాంతినగర్ వద్ద మంగళవారం ధర్నా చేశారు. సీఐటీయూ మండల కార్యదర్శి కె.తవిటి నాయుడు మాట్లాడుతూ ప్రజల హక్కులను హరించేలా కొత్త న్యాయ చట్టాలు ఉన్నాయన్నారు. వాటిని అమలును తక్షణం నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. ట్రక్కు డ్రైవర్లను క్రిమినల్స్‌ను చేస్తూ ఐదేళ్ల శిక్ష పడే విధంగా కేంద్రం పూనుకుంటోందని ఆరోపించారు. కార్యక్రమంలో అధ్యక్షులు పెంకి అప్పారావు, టీ.కృష్ణ, బొర్రా శ్రీను, సత్యం పాల్గొన్నారు.

పీహెచ్‌సీని సందర్శించిన ఎమ్మెల్యే



వైద్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కనుమూరు రఘు రామకృష్ణరాజు

పాలకోడేరు: ఉండి ఎమ్మెల్యే కనుమూరు రఘు రామకృష్ణరాజు పాలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన వైద్యాధికారి డాక్టర్ సిహెచ్.రంగనాయుడుని వివరాలు అడిగి తెలుసుకున్నారు. పీహెచ్‌సీలో ప్రసవాల సంఖ్య పెరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట కూటమి నాయకులు, కార్యకర్తలు, వైద్య సిబ్బంది ఉన్నారు.

మొక్కల పెంపకం ఆహ్లాదం, ఆరోగ్యం

పాఠశాల ఆవరణలో పచ్చటి మొక్కలను పుష్కలంగా పెంచడం వల్ల ఆహ్లాదంతోపాటు పిల్లలకు చక్కని ఆరోగ్యం సిద్ధిస్తుందని ఎమ్మెల్యే కనుమూరు రఘు రామకృష్ణరాజు అన్నారు. పాలకోడేరు జడ్పీ హైస్కూల్లో టీడీపీ నాయకులు మురళీకృష్ణంరాజు సౌజన్యంతో ఏర్పాటు చేసిన గార్డెన్ పనులను మంగళవారం ఎమ్మెల్యే, జాయింట్ కలెక్టర్ ప్రవీణ్ ఆదిత్య, విద్యాశాఖ ఆర్జేడీ నాగమణి ప్రారంభించారు. ఈ సందర్భంగా మొక్కలను నాటారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్చార్జి జుత్తిగ నాగరాజు, టీడీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఆచంటకు తణుకు మీదుగా బస్సులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): తణుకు రైల్వే ఇంజనీర్ ఆదేశాలు మేరకు ఈ నెల 3వ తేదీ బుధవారం నుంచి 5వ తేదీ శుక్రవారం వరకు అత్తిలి-మంచిలి రైల్వే లైన్ మరమ్మతులు నిమిత్తం మంచిలి రైల్వే గేటు మూసివేస్తున్నట్లు ఇచ్చిన సమాచారం మేరకు తాడేపల్లిగూడెం డిపో నుంచి అత్తిలికి ప్రతి రోజు ఉదయం 5.30 గంటల నుంచి ప్రతి రెండు గంటలకు ఒక బస్సు ఉన్నట్లు తెలిపారు. అదే విధంగా ఆచంటకు తణుకు మీదుగా బస్సులు నడుపుతున్నట్లు, మార్పును గమనించాలని డిపో మేనేజర్ యేలూరి సత్యనారాయణ మూర్తి విజ్ఞప్తి చేశారు.

పాడి పశువుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి

తాడేపల్లిగూడెం రూరల్: పాడి పశువుల ఆరోగ్యం పట్ల రైతులు శ్రద్ధ వహించాలని పట్టింపాలెం సర్పంచ్ బొనిగే పోతన అన్నారు. మంగళవారం మండలంలోని పట్టింపాలెం గ్రామంలో ఆవులకు ముద్ద చర్మ రోగం నివారణకు ముందస్తు టీకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ పోతన మాట్లాడుతూ సీజనల్‌గా వచ్చే వ్యాధుల పట్ల పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. మండల పశువైద్యాధికారి డాక్టర్ టీవీ.విజయ్ కుమార్ మాట్లాడుతూ అన్ని రైతు భరోసా కేంద్రాలు, పశువైద్య శాలల్లో ఆవులకు ముద్ద చర్మ రోగం నివారణ టీకాలు, గొర్రెలకు నీలి నాలుక వ్యాధి నివారణ టీకాలు వేస్తున్నట్టు తెలిపారు.

బ్రిడ్జిల అప్రోచ్‌లు పట్టించుకోరూ!

తరచూ ప్రమాదాలకు గురవుతున్న ప్రయాణికులు, వాహనదారులు

భీమవరం అర్బన్: యనమదుర్రు డ్రెయిన్‌పై బ్రిడ్జిల అప్రోచ్‌లు పట్టించుకోవాలని, యనమదుర్రు డ్రెయిన్‌పై నిర్మించిన బ్రిడ్జిల అప్రోచ్‌లు నిర్మించడంపై పాలకులు, అధికారుల నిర్లక్ష్యం ప్రజలు, ప్రయాణికులు, వాహనదారులకు శాపంగా మారింది. భీమవరం మండలంలోని గొల్లవానితిప్ప-రామాయణపురం, నాగేంద్రపురం-తోకతిప్ప, పట్టణంలో రెస్ట్‌హైస్ వద్ద యనమదుర్రు డ్రెయిన్‌పై నిర్మించిన వంతెనలు తుది దశకు చేరుకున్న ప్రారంభానికి నోచుకోవడం లేదు. అంతేకాకుండా ఆ వంతెనలకు అప్రోచ్ నిర్మించకపోవడంతో రాకపోకలు సాగించేందుకు గ్రామస్తులు, వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 2008లో అప్పటి ముఖ్యమంత్రి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి డెల్టా ఆధునీకీకరణ పనులు చేసేందుకు రూ. 110 కోట్లు నిధులు మంజూరు చేశారు. వాటిలో భాగంగా యనమదుర్రు డ్రెయిన్‌పై పట్టణంలో రెస్ట్‌హౌస్ రోడ్డు వద్ద, యనమదుర్రు, గొల్లవానితిప్ప, నాగేంద్రపురం, నాగిడిపాలెం గ్రామాల్లో బ్రిడ్జి నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. గొల్లవానితిప్ప - రామాయణపురం, నాగేంద్రపురం - తోకతిప్ప గ్రామాల మధ్య యనమదుర్రు డ్రెయిన్‌పై నిర్మించిన బ్రిడ్జి పనులు పూర్తైతే సుమారు 7 సంవత్సరాలు గడిచినా కాంట్రాక్టర్లు బ్రిడ్జికి ఇరువైపులా అప్రోచ్ నిర్మించకపోవడంతో గ్రామస్తులు, ప్రయాణికులు, వాహనదారులు, వృద్ధులు తరచూ ప్రమాదాలకు గురై తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ అప్రోచ్ నిర్మిస్తే కాళీపట్నం రోడ్డు నుంచి గొల్లవానితిప్ప బ్రిడ్జి మీదుగా కృష్ణా జిల్లాకు చేరుకోవచ్చని వాహనదారులు చెబుతున్నారు.

మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ చొరవతో టెండర్ దశకు

మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ఈ ప్రాంత ప్రజల కష్టాలను దృష్టిలో పెట్టుకుని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో రూ. 36 కోట్లు అప్రోచ్‌ల నిర్మాణానికి మంజూరు చేయించారు. టెండర్ ప్రక్రియ దశకు చేరుకునేటప్పటికి కొంత మంది గ్రామస్తులు పురాతన దేవాలయాలు పడిపోతున్నాయని చెప్పడంతో డిజైన్ మార్చి టెండర్ దశకు పంపించారు. తదానంతరం కూటమి ప్రభుత్వం రావడంతో ఈ సమస్యపై దృష్టి సారించడం లేదన్న విమర్శలు ఆయా గ్రామస్తులలో వెల్లువెత్తుతుంది.



మండలంలోని రామాయణపురం వద్ద బ్రిడ్జికి అప్రోచ్ లేని దృశ్యం



మండలంలోని గొల్లవానితిప్ప గ్రామంలో బ్రిడ్జికు అప్రోచ్ లేకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్న దృశ్యం



మూడు రోజులు క్రితం గొల్లవానితిప్ప వంతెన వద్ద అప్రోచ్ లేకపోవడంతో బోల్తా పడిన చెరుకులోడు వ్యాన్ (ఫైల్ ఫోటో)

తరచూ ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు

బ్రిడ్జికి ఇరువైలా అప్రోచ్ లేకపోవడంతో వాహనదారులు ఎత్తు ఎక్కలేకపోతున్నామని ఒక్కోసారి వాహనం అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నామని చెబుతున్నారు. గమ్య స్థానాలకు దగ్గర మార్గం కావడంతో స్కూల్ బస్సులు, ఆటోలు, చేపల వ్యాన్‌లు, ట్రాక్టర్లు నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. నెలకు రెండు, మూడు చొప్పున ప్రమాదాలు జరగడంతో ఈ ప్రాంత ప్రజలు ఏ సమయంలో ఏమి జరుగుతుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల చెరుకు లోడుతో వెళ్తున్న వ్యాన్ బోల్తా కొట్టడంతో డ్రైవర్, క్లీనర్ ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. గతంలో నాగేంద్రపురం బ్రిడ్జి వద్ద చేపల సీడ్ పిల్లలు తరలించే ట్రాక్టర్ అదుపుతప్పి పక్కనే ఉన్న పంటకాలువలో పడిపోవడంతో డ్రైవర్ మృతి చెందిన సంఘటన తెలిసిందే. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి అప్రోచ్ నిర్మించి బ్రిడ్జిని ప్రారంభించాలని వాహనదారులు, ప్రయాణీకకులు, స్థానికులు కోరుకుంటున్నారు.

ఆక్వా మహాసభను విజయవంతం చేయండి

వీరవాసరం: పాలకొల్లులో నిర్వహిస్తున్న ఆక్వా మహాసభను విజయవంతం చేయాలని వీరవాసరం మండల ప్రాన్ ఫార్మర్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్ల రాంబాబు మంగళవారం పిలుపునిచ్చారు. రొయ్యల సాగులో రైతులు పడుతున్న ఇబ్బందులను, సమస్యలపై చర్చించడానికి సమావేశం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. రొయ్యలకు ధరలు లేక పెరిగిన మేతలు, మందులు ధరల తాకిడితో రొయ్యల రైతులు ఆర్థికంగా చితికి పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఒక్క రొయ్యల రైతు తప్పనిసరిగా ఆక్వా రైతు మహాసభకు హాజరు కావాలని కోరారు.

ఆక్వా రైతుల సమస్యలు పరిష్కరించాలి

భీమవరం (ప్రకాశంచౌక్): ఆక్వా రైతుల సమస్యలు పరిష్కరించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను సీపీఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో ఆక్వా రైతుల సమస్యలపై ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఆక్వా రైతులు రొయ్యలు, చేపలను కష్టపడి పండిస్తున్నారని తెలిపారు. ఆక్వా రైతుల కృషి వలన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదాయం కూడా వస్తుందన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం, ఎంపెడ, ఫిషరీస్ డవలప్మెంట్ బోర్డు, రాష్ట్ర ప్రభుత్వం, మత్స్య శాఖ ఆక్వా రైతుల సమస్యలను పట్టించుకొని పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. ఆక్వా రైతుల సమస్యలపై రైతాంగం చేసే ఉద్యమాలకు, పోరాటాలకు సీపీఎం పార్టీ సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నామని తెలిపారు.

మొబైల్ యాప్, వెబ్‌సైట్ ద్వారా విద్యుత్ బిల్లుల చెల్లింపు

ఆకివీడు: ఏపీఈపీడీసీఎల్ వెబ్‌సైట్, మొబైల్ యాప్ ద్వారా విద్యుత్ బిల్లులు చెల్లించొచ్చని విద్యుత్ శాఖ ఈఈ పీర్ అహ్మద్ ఖాన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ కార్యాలయాల వద్దకు వెళ్లి చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. విద్యుత్ బిల్లులు చెల్లించేటప్పుడు ఏపీఈపీడీసీఎల్ పేరు కన్పించదన్నారు. సంస్థ మొబైల్ యాప్ ఈస్టన్ పవర్‌ని గూగుల్ ప్లేస్టోర్ నుంచి డౌన్లోడ్ చేసుకోవాలని సూచించారు. సంస్థ వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీఈస్టన్‌పవర్.కామ్ నుంచి బిల్లులు చెల్లించొచ్చని సూచించినట్లు అహ్మద్ ఖాన్ తెలిపారు. వినియోగదారులు తమ ఫోన్‌పే, జీపే, పేటీఎం, ఇతర యూపీఐ యాప్స్‌తో పాటు డెబిట్, క్రెడిట్, నెట్ బ్యాంకింగ్, వాల్లెట్స్, క్యాష్ కార్డ్స్ కూడా వాడుకోవచ్చని వివరించారు.

గ్రామాల అభివృద్ధికి సహకరించాలి

వీరవాసరం: గ్రామాల అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలని భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) తెలిపారు. వీరవాసరం ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో పాల్గొని ఆయన మాట్లాడారు. పంట కాలువలు, మురుగు డ్రెయిన్లను ప్రక్షాళన చేయాలని పూర్తిస్థాయిలో బాగు చేసి రైతులకు ఉపయోగపడేలా చూడాలన్నారు. ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అధికారులకు సూచించారు. రహదారులు, మురుగు డ్రెయిన్ల నిర్మాణానికి పూర్తిస్థాయిలో పనిచేయడం జరుగుతుందన్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ,మండల స్థాయి అధికారులు సమన్వయ పరుచుకుంటూ గ్రామాల పురోభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎంపీపీ వీరవల్లి దుర్గ భవాని, జెడ్పీటీసీ గుండా జయ ప్రకాష్ నాయుడు, ఎంపీడీవో పార్థసారథి, తహసీల్దార్ జె సుశీల దేవి, వైస్ ఎంపీపీ అడ్డాల శ్రీరామచంద్రమూర్తి, ప్రకాష్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అంజిబాబు

ముద్ద చర్మ వ్యాధికి వ్యాక్సిన్

ఆకివీడు: ఆవులలో వచ్చే ముద్ద చర్మ వ్యాధి (లంపీ స్కిన్ డీసీజ్)కి ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా వ్యాక్సిన్ వేస్తామని మండల వెటర్నరీ అధికారిణి కెల్లా భార్గవీసత్య తెలిపారు. మండలంలో వ్యాక్సిన్ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 4 నెలల ఆవు దూడ నుంచి ప్రతీ పశువుకూ ఇంటింటికీ వచ్చి వ్యాక్సిన్ వేస్తామని చెప్పారు. ఇది వైరల్ వ్యాధి అని, ఈ వ్యాధి సోకిన పశువు తీవ్ర జ్వరం, చర్మంపై పెద్ద పెద్ద బొడుపులు వస్తాయన్నారు. తరువాత అవి పగిలి గాయాలుగా మారి రక్తం కారుతుందన్నారు. కాళ్లు వాచి నడవ లేదని, పాల దిగుబడి తగ్గిపోతుందని, మేత తినకుండా కొన్ని సందర్భాల్లో పశువు చనిపోతుందని భార్గవి వివరించారు. రక్తం తాగే కీటకాల వల్ల ఒక పశువు నుంచి మరో పశువుకు వ్యాప్తి చెందుతుందన్నారు. ముక్కు, నోటి నుంచి వచ్చే స్రవాల వల్ల కూడా వ్యాధి వ్యాప్తి చెందుతుందని చెప్పారు. పశువుల రక్షణకు ప్రతీ రైతూ టీకాను వేయించాలని విజ్ఞప్తి చేశారు.



వ్యాక్సిన్ వేస్తున్న వెటర్నరీ అధికారిణి భార్గవీ సత్య

డయేరియా సోకకుండా జాగ్రత్తలు పాటించాలి

అత్తిలి: డయేరియా వ్యాధి సోకకుండా ఆరోగ్యకేంద్రాల సిబ్బంది, ఆశా వర్కర్స్ ప్రతి బిడ్డకు రెండు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డి మహేశ్వరరావు కోరారు. మంగళవారం అత్తిలి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో డయేరియా వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. మహేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన నీటిని తాగాలని తెలిపారు. నీళ్ల విరేచనాలు, వాంతులు అవుతుంటే ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ ట్యాబ్లెట్స్ అందించాలని కోరారు. వ్యాధి లక్షణా లు ఉంటే ఆరోగ్యకేంద్రాన్ని సంప్రదించాలని కోరారు.

కాలువల నిర్వహణ నిధికి ఎంపీపీ విరాళం

పాలకోడేరు: ఉండి నియోజకవర్గంలో పంట కాలువలు, డ్రైనేజీ నిర్వహణ నిధికి భూపతిరాజు సత్యనారాయణ రాజు (చంటి రాజు) రూ.లక్ష విరాళం ప్రకటించారు. మంగళవారం పాలకోడేరు సొసైటీలో నిర్వహించిన ఒక కార్యక్రమంలో విరాళం చెక్కును ఆయన ఎమ్మెల్యే కనుమూరు రఘు రామకృష్ణరాజుకు అందజేశారు. మండల అభివృద్ధికి పార్టీలకతీతంగా సహకరిస్తానని ఈ సందర్భంగా చంటి రాజు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం జీఐఎస్ విద్యుత్ ఉపకేంద్రం వార్షిక నిర్వహణ పనుల నిమిత్తం 3వ తేది బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ పీర్ అహ్మద్ ఖాన్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు పట్టణంలో బుధవరం మార్కెట్, మెంటేవారి తోట, శ్రీనివాస సెంటర్, బీఎస్ఎన్ఎల్ ఆఫీస్, గులాబీ సెంటర్, మారుతి టాకీస్, బస్టాండ్ ఏరియా, రిలయన్స్ సూపర్ మార్కెట్, కళాభవన్ ప్రాంతం పలు చోట్ల విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్(ఈ.ఈ)పీర్ అహ్మద్ ఖాన్ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

లయన్స్‌క్లబ్ సేవలు అభినందనీయం

తాడేపల్లిగూడెం (టీఓసీ): లయన్స్‌క్లబ్ సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. లయన్స్‌క్లబ్ ఆఫ్ తాడేపల్లిగూడెం ఆధ్వర్యంలో అధ్యక్షుడు వీవీఎస్ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో దాత పసుమర్తి హనుమంతరావు (అనిల్) ఆర్థిక సహకారంతో కడకట్ల జనతా చారిటబుల్ ట్రస్ట్ ఆస్పత్రిలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం జరిగింది. శిబిరంలో 87 మందికి రక్త పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పసుమర్తి చంద్రశేఖర్ శ్రీనివాసరావు, సుంకర శ్రీనివాసరావు, సెక్రటరీ చిన్నం జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

అల్లూరి ఆశయాలు నెరవేర్చాలి



అల్లూరి సీతారామరాజు జయంత్యుత్సవాలు నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): సాహస గాధలను భావి తరాలకు చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందని, స్వాతంత్ర్య ఉద్యమంలోని ఘట్టాలు బ్రిటిష్ వారిని సైతం ఆశ్చర్య పరిచాయని యూత్ హాస్టల్స్ అధ్యక్షుడు, ఏఎంసీ మాజీ చైర్మన్ చిలుకూరి నరసింహరాజు అన్నారు. విప్లవవీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి ఉత్సవాల్లో భాగంగా శ్రీవిజ్ఞాన వేదిక, అల్లూరి సీతారామరాజు యువజన సంఘం సమాఖ్య ఆధ్వర్యంలో విద్యార్థులతో ర్యాలీ, దేశ భక్తి ప్రతిజ్ఞ, పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహరాజు మాట్లాడుతూ మన ప్రాంతంలో 125 అడుగుల అల్లూరి విగ్రహాన్ని ప్రధాని మోదీ ప్రారంభించడం గొప్ప విశేషమన్నారు. స్కూల్ ప్రిన్సిపాల్ నడింపల్లి కృష్ణంరాజు, సమాఖ్య జిల్లా అధ్యక్షుడు కంతేటి వెంకటరాజు మాట్లాడుతూ విప్లవ వీరులు అతి తక్కువ కాలంలో మృతి చెందడం దురదృష్టకరమని, వారి చరిత్రలు మాత్రం చిరస్మరణీయంగా నిలుస్తున్నాయని తెలిపారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ జేఎల్ బి, పిఎస్ఎం, డిఎన్నార్, ఎస్‌సీహెచ్ బీఆర్ హైస్కూల్లో విద్యార్థులకు అల్లూరి ఆశయాలు నెరవేరుద్దాం .. అనే అంశంపై వ్యాస రచన పోటీలను నిర్వహిస్తున్నామని, గెలుపొందిన వారికి 4న జరిగే ముగింపు వేడుకల్లో బహుమతులు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ పట్టణ ఉపాధ్యక్షుడు నరహరిశెట్టి కృష్ణ, కలిదిండి ప్రసాద్ రాజు, స్కూల్ ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

నిల్వ ఆహారాన్ని తీసుకోరాదు

తాడేపల్లిగూడెం రూరల్: ఇంటిలో నిల్వ ఉన్న ఆహార పదార్థాలను తినరాదని వెంకట్రామన్నగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి జి.రూపాదేవి అన్నారు. మంగళవారం మండలంలోని వెంకట్రామన్నగూడెం పీహెచ్‌సీ పరిధి గ్రామాల్లో స్టాప్ డయేరియాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రూపాదేవి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ క్లోరినేషన్ చేసిన నీటిని తాగాలని, కాచి చల్లార్చిన నీటిని తీసుకోవాలని సూచించారు. నీళ్ల విరోచనాల లక్షణాలు ఉంటే దగ్గరలోని అంగన్‌వాడీ కేంద్రాలను సంప్రదించాలన్నారు. అక్కడ అందించే ఓఆర్ఎస్, జింక్ మాత్రలు ద్వారా నీళ్ల విరోచనాలను నివారించవచ్చన్నారు. గ్రామాల్లోని ఓవర్ హెడ్ ట్యాంకులను క్రమం తప్పకుండా పరిశుభ్రం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో సూర్యకాంతం, హెచ్‌వీ జ్యోతిర్మయి, హెచ్ఎస్ లక్ష్మణ్, ఫార్మాసిస్ట్ రామారావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు జి.బేబి, డి.ఎస్తేరు రాణి, హెల్త్ అసిస్టెంట్లు, ఎంఎల్‌హెచ్‌పీలు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

కొండెక్కిన 'కూరగాయలు'

- టమాటా, పచ్చిమిర్చి పైపైకి
- చుక్కల్లో నిత్యావసరాల ధరలు
- వినియోగదారుల ఆందోళన



మార్కెట్‌లో విక్రయానికి సిద్ధంగా ఉన్న కూరగాయలు

తణుకు: రోజరోజుకు పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలకు ఇప్పుడు కూరగాయల ధరలు తోడయ్యాయి. అమాంతంగా పెరిగిన కూరగాయల ధరలతో పేద, మధ్య తరగతి కొనలేక అవస్థలు పడుతున్నారు. ఏం కొనాలన్నా కిలో రూ. 60లు పైమాటే. టమాట పులుపెక్కితే.. మిర్చి ఘాటెక్కింది. కాకర మరింత చేదెక్కింది. రోజుల వ్యవధిలోనే ధరలు అమాంతం పెరగడంతో వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్లో కూరగాయలు కొండెక్కి కూర్చున్నాయి. దీంతో సామాన్య ప్రజలు ఏమీ కొనలేం.. తినలేమంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిన్న, మొన్నటి వరకు ఓ మోస్తరులో ఉండే ధరలు నేడు చుక్కలనంటుతున్నాయి. మార్కెట్‌కు వెళ్లి కూరగాయల ధరలు చూస్తే సామాన్యుల గుండె బరువెక్కిపోతోంది.

రెండింతలు పెరిగిన ధరలు...

నిత్యం కూరల్లో వినియోగించే కూరగాయల ధరలు భారీగా పెరిగాయి. కిలోలల్లో కొనుగోలు చేసేవారు సైతం ప్రస్తుతం పెరిగిన ధరలకు పావు, అరకిలో కొనుగోలు చేస్తూ సరిపెట్టుకుంటున్నారు. ప్రస్తుతం తణుకు మార్కెట్‌లో కూరగాయల ధరలు ఒక్కసారిగా రెండింతలు పెరగడంతో ఏమీ కొనలేకపోతున్నామని వినియోగదారులు వాపోతున్నారు. మరోవైపు పప్పు దినుసుల ధరలు కూడా భగ్గుమంటున్నాయి. ఏ కూరగాయాలు కొనుగోలు చేయాలన్నా కిలో రూ. 60 పైమాటే పలుకుతున్నాయి. ఎండాకాలం పేరుతో మరింత ధరలు పెంచి విక్రయిస్తున్నారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా 70 శాతం మంది రైతులు కూరగాయల సాగు చేపట్టలేదు. వంటింట్లో ఎలాంటి వంటకాలు చేయాలన్నా టమోటా, పచ్చిమిర్చి, ఉల్లిగడ్డలు తప్పనిసరిగా ఉండాలి. రోజువారి వాడకంలో వీటి పాత్ర చాలా కీలకం. వీటిలో మిర్చి ధర ఘాటెక్కిస్తోంది. ప్రస్తుతం మార్కెట్‌లో కిలో పచ్చిమిర్చి రూ. 80 పలుకుతోంది. కిలో టమోటా రూ. 60, క్యారెట్, రూ. 60, వంకాయలు రూ. 60, చిక్కుళ్లు రూ. 80, బీట్‌రూట్, బెండ, బీన్స్ ధరలు రూ. 100 పైగా ధరలు పలుకుతున్నాయి. సామాన్య ప్రజలకు పెరిగిన కూరగాయల ధరలు భారంగా మారాయి.